ప్రజాశక్తి
సోమవారం 27 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

జ్యోతి ఐటిఐలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జ్యోతి ఐటిఐ విద్యార్థులకు సోమవారం నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని కరస్పాండెంట్ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో వృత్తి విద్యా కోర్సులతో పాటు కంప్యూటర్లో కూడా అవగాహన ఉండాలని, అదనంగా ప్రథమ ద్వితీయ ఫిట్టర్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ఈనెల 27 నుండి ఎమ్మెస్ ఆఫీస్, ఎక్సెల్, ఫోటోషాప్, డిటిపి వివిధ కంప్యూటర్ క్యాడర్లో శిక్షణ మూడు నెలలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.

భూ బాగోతంలో అధికారులే పాత్రధారులు

- కమీషన్లకు కక్కుర్తిపడి ఆక్రమణదారులతో కుమ్మక్కు
- బైపాస్ రోడ్డు పక్కనే వడ్డివీధి రాముడి భూములు
- ధర్మకర్త పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు
- జగనన్నకు చెపుదాంలో ఫిర్యాదుపై దర్యాప్తు

ఆక్రమణకు గురవుతున్న వడ్డివీధి రామమందిరం

ప్రజాశక్తి - సాలూరు

దేవుడి భూములు కైంకర్యం చేస్తున్న భాగోతంలో దేవాదాయ శాఖ అధికారులే అసలు సూత్రధారులుగా కనిపిస్తున్నారు. ఆలయం ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా ఆక్రమణదారులతో దేవాదాయ శాఖ అధికారులు కుమ్మక్కవ్వడం వల్లనే చర్యలు కనిపించడం లేదు. దొంగలు దొంగలు కలిసి భూములు పంచుకున్నట్లు ఆక్రమణదారులు, దేవాదాయ శాఖ అధికారులు పరస్పర అవగాహనతో నడుచుకుంటూ దేవునికే శఠగోపం పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పట్టణంలోని వడ్డివీధి రామమందిరం పేరిట కోట్లు విలువ చేసే భూములు ఉన్నాయి. సీతారామస్వామి పేరిట నెలిపర్తి రెవిన్యూ పరిధిలో 30ఎకరాల భూములు ఉన్నాయి. సర్వే నెంబర్ 52/1 నుంచి 58/3 వరకు ఈ భూములు విస్తరించి ఉన్నాయి. ఆలయ ధర్మకర్త మజ్జి సూర్యనారాయణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులు ఈ భూములు అనుభవిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్నప్పుడు ఆంధ్ర జమిందార్ వడ్డివీధి రామమందిరం పేరిట ఈ భూములు విరాళంగా అందజేశారు. ఆలయం ట్రస్టు పేరిట 170ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఆలయంలో దేవుడికి రోజువారీ ధూపదీప నైవేద్యాల కోసం ఈ భూములపై వచ్చే ఆదాయాన్ని ఖర్చు చేయాలని నిర్ణయించారు. కోట్లు విలువ చేసే భూములు ఉన్నా ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత 20ఏళ్లుగా ఆలయం ధర్మకర్త సాగులోనే భూములు ఉన్నాయి.

మజ్జి కుటుంబ సభ్యుల పేరిట పాసుపుస్తకాలు

ఆలయం భూములు ట్రస్ట్ పేరిట ఉన్నందున వాటికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు ట్రస్ట్ పేరునే మంజూరు చేయాల్సి ఉంది. అయితే గతంలో పనిచేసిన మండల రెవెన్యూ అధికారులు ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులతో లాలూచీ పడి వారి పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. దీంతో వారు ఆ భూములను తమ సొంత ఆస్తులు గా పరిగణిస్తున్నారు. వాటిపై వస్తున్న లీజు ఆదాయాన్ని దేవాదాయ అధికారులతో కుమ్మక్కై అనుభవిస్తున్నారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం వడ్డివీధి రామమందిరం పేరిట ఉన్న కొంత భూమి అమ్మకమైంది. దీని కింద పరిహారంగా రూ.17లక్షలు మంజూరయ్యాయి. ఈ పరిహారాన్ని సాగుదారులుగా ఉన్న ఆలయం ధర్మకర్త కుటుంబ సభ్యుల పేరిట మంజూరు చేశారు. అలాగే వ్యక్తుల పేరిట దేవుని భూమి పరిహారాన్ని పంపిణీ చేయొద్దని కొంతమంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. అయితే అప్పటి సబ్ కలెక్టర్ ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులతో లాలూచీ పడి పరిహారాన్ని వారికే మంజూరు చేశారనే ఆరోపణలు వినిపించాయి. దేవాదాయ అధికారులు ధర్మకర్త కుటుంబ సభ్యులకు పరిహారం చేయొద్దని లేఖ రాసినా రెవెన్యూ అధికారులు పెడచెవిన పెట్టారు. ఈ భూములను జిపిఆర్‌ఎస్ సర్వే చేయాలని, అంతవరకు బైపాస్ రోడ్డు పరిహారం చెల్లించొద్దని కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. జిపిఆర్‌ఎస్ సర్వే చేయడానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వే స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఆలయం ఇఒ కూడా హాజరయ్యారు. సర్వే చేయడానికి భూమి సాగుదారులుగా ఉన్న ధర్మకర్త కుటుంబ సభ్యులు హాజరు కాలేదు. కానీ హాజరైన రికార్డుల్లో చూపించారు. టిడిపి హయాంలో ఈ సంఘటన జరగడం, అధికారపార్టీ నాయకులతో ధర్మకర్త కుటుంబ సభ్యులకు సంబంధాలు కలిగి ఉండడంతో సర్వే చేయకుండానే మమ అనిపించారు.

'జగనన్నకు చెపుదాం'లో ఫిర్యాదుపై దర్యాప్తు

వడ్డివీధి రామమందిరం పేరిట ఉన్న భూములు అన్యాక్రాంతమవుతున్నాయని మాజీ కౌన్సిలర్ పిరిడి రామకృష్ణ ఈనెల 24న జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూములను దేవాదాయ శాఖ అధికారుల అండదండలతో ఆలయం ధర్మకర్త కుటుంబ సభ్యులు అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలిపర్తి రెవెన్యూ పరిధిలో బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భూముల విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.50కోట్లపైనే ఉంటుంది. ఇంతటి విలువైన భూములను కాపాడుకోవడంలో దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో మండలతహశీల్దార్ బాలమురళీకష్ణ విచారణ ప్రారంభించారు.

అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

దళిత, గిరిజనులకు దిక్సూచి రాజ్యాంగం

అంబేద్కర్‌కు నివాళులర్పించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

దేశంలోని దళిత, గిరిజనులకు భారత రాజ్యాంగం దిక్సూచి లాంటిదని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి రోజున నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసిన తర్వాతనే రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడిగా అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. ఒక్కో దేశ రాజ్యాంగం లోని గొప్ప గొప్ప అంశాలను తీసుకుని ఇక్కడ రాజ్యాంగంలో పొందుపర్చాని చెప్పారు. దళిత, గిరిజనుల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని అప్పటిలో గుర్తించి ముందు చూపుతో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని చెప్పారు. అలాంటి మహనీయుడు కోట్లాదిమంది భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాజన్నదొర అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, సింహాచలం,ఎం.అప్పారావు, తాడ్డి యశోదకృష్ణ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షక మహాధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 27, 28న విజయవాడలో జింఖానా గ్రౌండ్స్ లో జరిగే కార్మిక కర్షక మహా ధర్నాకు కదలిరావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఆదివారం కొమరాడలో జరిగిన ప్రజాసంఘాల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారి అనుకూల విధానాలతో కార్మిక, కర్షక, పేదలకు తీరని ద్రోహం జరిగిందన్నారు. మునిపెన్నడు లేని విధంగా నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోతున్నదని, మరోవైపు దేశంలో దళిత, గిరిజన, మైనారిటీ, మహిళలపై విచ్చలవిడిగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కేంద్ర కార్మిక, రైతు సంఘాలు తలపెట్టి దేశవ్యాప్తంగా మహాధర్నాకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ నాయకులు కొల్లి సాంబమూర్తి, అంగనవాడి యూనియన్ నాయకులు అనురాధ, లలిత, ఎపి గిరిజన సంఘము నాయకులు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివుని నాయుడు, మధ్యాహ్న భోజన మండల నాయకులు నిర్మలమ్మ, ఆశ వర్కర్ల మండల నాయకులు పార్వతి, సిహెచ్ డబ్ల్యు మండల నాయకులు మంగమ్మ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

పార్వతీపురంటౌన్ : స్థానిక స్వీపర వీధిలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఈనెల 27,28 మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు నాయకులు బి.సూరిబాబు, మామిడి శివ, బంగారి కాశి, బంగారి రాజా, ఇసకపల్లి సోమేశ్వరరావు, మామిడి గౌరీశంకర్రావు, గంట్రెడ్డి చిన్నమ్మలు, పాలకొండ దుర్గ, మంగళగిరి ముత్యాలు, మంగళగిరి మంజు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలోని జింఖానా మైదానంలో జరగబోయే కార్మిక, రైతు మహాధర్నా తరలిరావాలని మండలంలో ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతుల సమస్యలను పరిష్కరించకుండా వివక్షత చూపుతున్నారని అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో కరువు తాండవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహరించడం తగదన్నారు. ప్రచార కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక ఆడిత్, బిడ్డిక రవణమ్మ, సాంబమూర్తి ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లను బలోపేతం చేయాలి

- జనసేన, గిరిజన సంఘం నాయకుల డిమాండ్
- మూడో రోజుకు చేరిన ఎస్‌ఎఫ్‌ఐ దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందని, కనీసం పాలక ప్రభుత్వాలు వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమని జనసేన పట్టణ నాయకులు వి.దాలినాయుడు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రంజిత్ కుమార్ విమర్శించారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ తలపెట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జనసేన, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు దీక్షా శిబిరానికి వచ్చి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు దాలినాయుడు మాట్లాడుతూ మన్యం జిల్లా అనే పెట్టి, జిల్లా వాసులను అడవుల్లో ఉన్న జంతువుల్లా ప్రభుత్వ వర్గాలు చూస్తున్నాయని, ఇది దారుణమని ఖండించారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులకు పట్టడం లేదాని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో గల హాస్టళ్లలో ఈనాటికి మరుగుదొడ్లు లేక అరుబయటకు విద్యార్థిని, విద్యార్థులు పోతుండడం చాలా అవమానకరమని, వెంటనే అధికారులు స్పందించి మరుగుదొడ్లు, మౌలికసదుపాయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి ఎస్‌ఎఫ్‌ఐ చేస్తున్న పోరాటం చాలా అద్భుతమైందని, భవిష్యత్‌లో ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలకు జనసేన అన్నివేళలా తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పి. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల పోరాటం పార్వతీపురంకు వెన్నుదన్నుగా నిలించందని, అటువంటి పోరాట స్ఫూర్తితో ఉద్యమాని ఉధృతం చేయాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వం అరకొర నిధులతో అభివృద్ధి భూతం చూపెడుతుందని, వెంటనే బకాయి నిధులను కేటాయించి, హాస్టళ్ల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు కె. రాజు, కమిటీ సభ్యులు సురేష్, ధనుంజయరావు, ముఖేష్, శ్రావణ్, జనసేన కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్‌కుమార్

మౌఖిక ఆదేశాలతో లీలావతి పర్యటన

ఎట్టకేలకు తేల్చేసిన అధికారులు • 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అపరిచిత వ్యక్తి అనధికార పర్యవేక్షణపై అధికారులు ఎట్టకేలకు తేల్చారు. లీలావతి అనే మహిళ ఈ నెల 22, 24 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అనధికారిక సమీక్షలు, పరిశీలనలు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో 'ఎవరీ అజ్ఞాతవాసి' అనే శీర్షికతతో ఈనెల 23న, 'మౌనం వెనుక మర్మమేమిటో' అన్న శీర్షికతో ఈ నెల 26న ప్రజాశక్తిలో ప్రత్యేక కథనాలు వెలువడిన విషయం విదితమే. దీనిపై విజయనగరం డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఎట్టకేలకు స్పందించారు. ఉపాధి హామీ పనుల వీడియో డాక్యుమెంటేషన్, సక్సెస్ స్టోరీ రూపొందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్.. లీలావతిని నియమించారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీడీ ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనర్ మౌఖిక ఆదేశాలతో భోగాపురం మండలం నందిగాం వచ్చారని వెల్లడించారు. 23న వచ్చిన కథనం వచ్చేటప్ప టికి లీలావతి ఫీల్డ్ విజిట్‌పై తనకు ఎలాంటి సమాచారమూ లేదంటూ డ్వామా పీడీ ప్రజాశక్తికి చెప్పడం గమనార్హం. మొత్తానికి లీలావతి పర్యటన కమిషనర్ మౌఖిక ఆదేశాలతో జరిగినట్టు అధికారులు తేల్చేశారు.

రెండో రోజూ కొనసాగిన విలువిద్య పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో జరుగుతున్న 67వ అంతర్‌జిల్లాల విలువిద్య పోటీలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ పోటీల్లో రికర్వ్ విభాగంలో అన్ని వయసు గల బాలబాలికలకు పోటీలు పూర్తి అయ్యాయి. అనంతరం ఇండియన్ రౌండ్ (వెదురు విల్లులు) విభాగం 14, 17 బాల, బాలికల పోటీలు పూర్తయ్యాయి. అలాగే సోమవారం ఉదయం 7గంటల నుంచి ఇండియన్ రౌండ్ అండర్-19 విభాగం బాలికలకు, అండర్ 14,17,19 విభాగాలల్లో బాల బాలికలకు కాంపౌండ్ విభాగంలో పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో సుమారు 600మందికి పైబడి వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు సోమవారం అందజేస్తారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, ఎంఇఒలు జి.సూర్య దేముడు, ఎం.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు డి.గాంధీ, ఎస్.శ్రీనివాసరావు, ఎస్.మురళి, సిహెచ్ వాసుదేవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

3.25లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

- ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం
- జిల్లా వ్యాప్తంగా 180 కేంద్రాలు
- సిద్ధంగా గోనె సంచులు
- ప్రజాశక్తితో పౌరసరఫరాల జిల్లా మేనేజర్

నాయక్ ముఖాముఖి



జిల్లాలో ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎండి నాయక్ చెప్పారు. ఈ ఏడాది సుమారు 3.20లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాది చెల్లింపులు కూడా సకాలంలోనే జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 180 ఆర్‌బికెల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే సిబ్బంది నియామకం పూర్తయ్యిందని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన వస్తు సామగ్రి కూడా సిద్ధం చేశామని స్పష్టం చేశారు. రవాణా, కూలీల ఛార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే రైతులు నిర్భయంగా ఫిర్యాదులు చేయొచ్చన్నారు. మరిన్ని వివరాలను 'ప్రజాశక్తి' ముఖాముఖికి తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే....

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

➡ ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం ఎంత?

ఈ ఏడాది 3.20లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ఏడాది 2.30లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ఈ ఏడాది దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ ఆశాభావం వ్యక్తం చేసిన నేపథ్యంలో గత ఏడాది కన్నా లక్ష్యాన్ని పెంచుకున్నాం.

➡ ఎన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జిల్లా వ్యాప్తంగా 185 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఏడాది రైతుల బయోమెట్రిక్ కూడా సేకరిస్తున్నాం. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో కొనుగోలుకు అవసరమైన అన్ని రకాల సామాగ్రి సిద్ధంగా ఉంది. ఈ నెలాఖరులోపు అన్ని చోట్ల కొనుగోళ్లు ప్రారంభమౌతాయి.

➡ సిబ్బంది నియామకమైందా?

ప్రతి కొనుగోలు కేంద్రంలో ముగ్గురు చొప్పున సిబ్బందిని నియమించాం. వీరితో పాటు అన్ని కేంద్రాలకు ఇద్దరు చొప్పున కస్టోడియన్ ఆఫీసర్లను నియమించాం. ముఖ్యంగా ప్రచార సామగ్రి, జిపిఎస్ డివైజర్స్, బయోమెట్రిక్ డివైజర్స్, ఎలక్ట్రానిక్ కాటాలు, గోనె సంచులు ఆర్‌బికెలకు చేరాయి. ఎక్కడైనా ఆటకం ఉంటే, వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

➡ ట్రాన్స్‌పోర్టు, లేబర్ ఛార్జీలు చెల్లింపు ఎలా ఉంటుంది?

ధాన్యం ట్రాన్స్‌పోర్ట్, లేబర్ ఛార్జీలతోపాటు గోనె సంచుల బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఒకవేళ ఈ మూడింటి బాధ్యత రైతులు చూసుకుంటే వాటికి సంబంధించిన సొమ్ము రైతులు పొందవచ్చు. కేజీకి రూ.3.39 ట్రాన్స్‌పోర్టు ఛార్జీ, 40కేజీల బస్తాకు రూ.17.17 చొప్పున లేబరు ఛార్జీ ప్రభుత్వమే 21రోజుల వ్యవధిలో చెల్లిస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలకు 16వేల గోనె సంచులు పంపాము.

➡ ఎన్ని మిల్లులకు తరలించనున్నారు?

ధాన్యం తరలింపు విషయంలో గతంలో అమలు చేసిన జంబ్లింగ్ విధానం ప్రభుత్వం రద్దుచేసింది. జిల్లా వ్యాప్తంగా 84 రైస్ మిల్లులు ఉన్నాయి. వీటి ద్వారా ధాన్యం కొనుగోలు నిమిత్తం రూ.40 కోట్ల వరకు బ్యాంకు గ్యారెంటీలు రావాల్సి ఉంటుంది. సంబంధిత మండల పరిధిలోని మిల్లులకు మాత్రమే పంపుతాం. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వలేకపోతే పక్క మండలానికి పంపేందుకు అవకాశం ఉంది.

➡ ఈ ఏడాది ధాన్యం ధర ఎలా ఉంది?

'ఎ' గ్రేడ్ ధాన్యం రూ.2,203, సాధారణ రకం రూ.2,060 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే కేజీపై రూ.140 ధర పెరిగింది. నాణ్యతా ప్రమాణాలు కొనుగోలు కేంద్రం వద్దే పరిశీలిస్తారు. ఎగ్రేడ్ లేదా సాధారణ రకాల మద్ధతు ధర పొందడానికి గరిష్టంగా 4శాతానికి మించి ఉండరాదు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమకు ఫిర్యాదు చేయవచ్చు.

➡ చిరుధాన్యాలేమైనా కొనుగోలు చేస్తున్నారా?

ఔను...! చిరుధాన్యాలు కొనుగోలు చేస్తున్నాం. జిల్లాల్లో రాగులు మాత్రమే ఎక్కువగా సాగవుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని 10 మండలాల్లో (ముఖ్యంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సాలూరు, సీతంపేట) కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. మొత్తం 49ఆర్‌బికెల ద్వారా వీటిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. క్వింటా రూ.3,846 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించింది.

వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు రాజ్యాంగం రక్షణ : పిఒ

ప్రతిజ్ఞ చేయిస్తున్న పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశంలోని ప్రతి వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యంతో జీవించేందుకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. స్థానిక ఐటిడిఎలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ విభిన్న భాషలు, సంస్కృతులు, జాతులతో కూడిన భారతదేశంలో అన్ని మతాలు, జాతుల వారికి సమాన హక్కులు కల్పిస్తూ రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. ప్రభుత్వ వ్యవస్థ నిర్వహణలో రాజ్యాంగం ప్రతి వ్యవస్థకు అధికారాలు, పరిమితులు విధించిందని, ప్రతి వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు, బాధ్యతలను కూడా స్వీకరిస్తూ, దేశ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి సత్యం నాయుడు, ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

పార్వతీపురంరూరల్ : రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ పీఠిక పఠించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహోన్నత ఆశయంతో రాజ్యాంగానికి రూపకల్పన చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను దేశం ఎప్పటికీ మరువదన్నారు. అంబేద్కర్ సారథిగా ఏర్పాటైన డ్రాఫ్టింగ్ కమిటీ భిన్నత్వ సమ్మిళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎంతగానో శ్రమించారని, మనం అంతా గర్వించదగిన రాజ్యాంగాన్ని రూపొందించడానికి అవిశ్రాంతంగా శ్రమించిన గొప్ప మేధావులకు ఘనమైన నివాళి అందించేందుకే ఈ ప్రత్యేక దినం వేడుకలా జరుపుకుంటున్నామని కొనియాడారు. వారి ఆశయాలకు ఆదర్శంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. డిఇఒ ఎన్.ప్రేమ కుమార్ మాట్లాడుతూ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ 125వ జయంతి పురస్కరించుకొని 2015 నుండి భారత రాజ్యాంగాన్ని దత్తత చేసుకున్న నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్, జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీరామ్మూర్తి, మార్కెటింగ్ శాఖ ఎడి ఎల్. అశోక్‌కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి. రంజిత్ కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణ ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ స్ఫూర్తితో, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వైస్ చైర్మన్లు, వివిధ మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, మేధావులు, పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని ప్రవేశ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. భారత రాజ్యాంగంలోని చట్టాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వై.రోసిరెడ్డి, ఇఇ ఎస్.సింహాచలం, సిడిపిఒ పి.రంగలక్ష్మి గురుకుల సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, ఎఇ మోహన్, గోపాల్, ఎపిఒ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ ఎస్.సత్యనారాయణ హాజరై రాజ్యాంగ నిర్మాతలైన బాబు రాజేంద్రప్రసాద్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. జగదీశ్వరరావు, సంతోష్ కుమార్ పండ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మధ రావు, పాలవలస ధవళేశ్వరరావు, నీలాపు శ్రీను, కోరికాన గంగునాయుడు, కిల్లారి మోహన్, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, దుంపల రమేష్, కోరాడ రవి, సుంకరి ధర్మ, రెడ్డి కేశవరావు, కోట మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో, భారత సంవిధాన ప్రతిజ్ఞ ను చేసి, పిల్లలకు భావి భారత పౌరులుగా రాజ్యాంగ విలువలను, స్వేచ్ఛ స్వాతంత్ర్యం సమానత్వం సౌభ్రాతృత్వం పాటించాలని సందేశం ఇచ్చారు. అలాగే ధారపాడు పంచాయతీలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రం పటానికి పూలమాలవేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె..గీతాంజలి, శంభాం కార్యదర్శి వి.వినోద్, ఎపిఒ సాగర్, ధారపాడు సర్పంచ్ సుందరమ్మ కార్యదర్శి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతర విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే చిట్టపూడివలసలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎస్.రాంబాబు విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎ.వెంకటరావు, ఎం.ధనుంజయనాయుడు, టి.ప్రశాంతి, డిటివి రత్నం, ఎస్.రవికుమార్, ఎ.చంద్రమోహన్, పి.శ్రీదేవి, వి.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు రాజ్యాంగం గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ ఎం కోడూరు లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భామిని: స్థానిక అంబేద్కర్ కూడలిలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం ఆధ్వర్యంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రసాదరావు, వైసిపి నాయకులు పోతల మజ్జి, బొమ్మాలి సంజీవరావు, కొల్ల రామారావు, రొక్కం రమేష్, గేదెల మోహన్ రావు, పోతల హరికృష్ణ, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి ఎపి గిరిజన గురుకుల బాలికల (పి టి జి) పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థుల చేత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, గిరిజ, చంద్రమౌళి, బంగారు రాజు, సీత, పాఠశాల సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు; కురుపాంలో అంబేద్కర్, రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

కింది కి విడుదలైన తోటపల్లి నీరు

తోటపల్లి నీరు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తోటపల్లి రిజర్వాయర్ గేట్లను ఇరిగేషన్ అధికారులు గత నెల 25న మూసివేసిన నెలరోజుల తర్వాత ఆదివారం మళ్లీ గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. రిజర్వాయర్ గేట్లను మూసి వేయడంతో రిజర్వాయర్ దిగువన ఉన్న ఇన్‌ఫిల్టరేషన్ బావులకు నీరు చేరకపోవడంతో పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల వినతుల మేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు శనివారం ఇరిగేషన్ ఇఇతో మాట్లాడారు. రిజర్వాయర్ గేట్లను రెండు అడుగుల మేరకు ఎత్తి నీటిని విడుదల చేయాలని, తద్వారా ఇన్‌ఫిల్టరేషన్ బావులకు నీటి ప్రవాహం వస్తుందని, దీనివల్ల పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుందని సూచించారు. దీంతో ఇరిగేషన్ ఇఇ ఆదివారం రిజర్వాయర్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ ఎఇ ఆనంద్ తెలిపారు.

28, 29 తేదీల్లో రోల్ అబ్జర్వర్ పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల రోల్ అబ్జర్వర్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఓటరు జాబితా సవరణ వివరాలు తనిఖీ చేస్తారని, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు నమోదు అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.



ఎండిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

రైతు సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

ప్రజాశక్తి - మక్కువ

సాలూరు నియోజకవర్గ పరిధిలో వర్షాల్లేక పంటలు ఎండిపోయి దిక్కు తోచని స్థితిలోఉన్న రైతులున్నారని, వారు పడుతున్న ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని సాలూరు నియోజకవర్గ జనసేన, టిడిపి సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ప్రశ్నించారు. మండలంలోని కోన, దబ్బగెడ్డ, విజయరాంపురం తదితర గ్రామాల్లో వరి పంటలు వేసి నష్టపోయిన రైతులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం పంటపొలాలకు వెళ్లి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఇప్పటి వరకు కొన్ని చోట్ల పంట నష్టం జరిగిందని, వారికి తగిన నష్ట పరిహారాన్ని, వాటికి సంబంధించి రైతులకు తగిన, హామీ కాని ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారులు, అధికార పార్టీ నేతలు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చి వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండల కేంద్రంలో, అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులతో కలసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు చప్పా రమేష్, దబ్బగెడ్డ టిడిపి సీనియర్ నాయకులు లావేటి కృష్ణ, డి.రామకృష్ణ, కోన గ్రామ సీనియర్ కార్యకర్త జి.వెంకటేష్, ఇరు పార్టీల కార్యకర్తలు, పంటలు నష్టపోయిన రైతులు పాల్గొన్నారు.

డైట్ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలో డైట్ కళాశాల ఏర్పాటు చేయాలని టిడిపి అరుకు పార్లమెంటరీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రభుత్వాన్ని కోరారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో డిగ్రీ పూర్తి చేసిన యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. అయితే వీరు ఉపాధ్యాయ శిక్షణ కోసం విజయనగరం, విశాఖ వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నారన్నారు. దీంతో తీవ్ర ఆర్థిక భారమవుతుందన్నారు. డైట్ శిక్షణ పట్ల ఆసక్తి ఉన్నా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేసి నిలిపి వేశారని తెలిపారు. గిరిజన యువత సౌకర్యార్థం ఇక్కడ డైట్ కళాశాల ఏర్పాటు చేసి ఉపాధ్యాయ శిక్షణ అందిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణబాబు కోరారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు అన్నారు. ఈనెల 27,28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు బయలుదేరే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస అవసరాలు తీర్చేందుకు కూడా మున్సిపాలిటీల్లో నిధుల్లేకుండా చేసిందని చెప్పారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని సిఎం జగన్ మోహన్ రెడ్డి చెప్పి మోసం చేశారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి వుండగా అమలు చేయలేదని చెప్పారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఎన్వైనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకులు టి.శంకరరావు, టి.వెంకటరావు, టి.ఇందు, స్వప్న పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి డిమాండ్ చేశారు. కరువు ఏర్పడ్డ ప్రాంతాల్ని ఆమె పరిశీలించారు. ఈ ఏడాది వర్షాల్లేక వరి పంట పూర్తిగా మాడిపోయి కరువు ఏర్పడిందని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయని, ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పంట వేసిన గిరిజన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మైదాన ప్రాంతంలో అడవి ఏనుగులు అరటి, మొక్కజొన్న, చెరకు, వరి పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. ఏ రకంగా చూసినా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న జగదీశ్వరి

హామీలకే పరిమితమా..?

తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా పట్టని పాలకులు
అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంలా ఉంది వీరఘట్టం పరిస్థితి. ఈ మండలంలో హేమాహేమీ నాయకులున్నప్పటికీ ప్రజలకు ఎంతో అవసరమైన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దశాబ్దాలు గడిచినా ఆచరణకు నోచుకోలేదు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో సుమారు 67 వేలకుపైగా జనాభా ఉన్నారు. అలాగే 16వేల వరకూ గృహసముదాయాలున్నాయి. మండలంలో ఏ కాస్త అగ్ని ప్రమాదం జరిగినా, మంటలను నివారించేందుకు అగ్నిమాపక శకటం లేదు. దీంతో సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలకొండ అగ్నిమాప కేంద్రానికి సమాచారం అందించి, అక్కడ నుండి అగ్నిమాపక శకటం ఘటనా స్థలానికి చేరుకునేసరికి జరగాల్సిన ప్రమాదం జరిగిపోతుంది. దీంతో బాధితులు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగులుతున్నారు. ఇందుకు ఈ ఏడాది జరిగిన సంఘటనలే సాక్ష్యం.

మండలంలోని ఈ ఏడాది జనవరి 13న వీరఘట్టానికి చెందిన ఆలుబిల్లి మజ్జి ఈశ్వరరావు అనే రైతుకు చెందిన రెండున్నరెకరాల పరిచేను కాలి బూడిదైపోయింది. చేసిన అప్పులు ఎలా తీరుతాయో బోరున విలపించడంతో పలువుర్ని కంటతడి పెట్టింది. ఈనెల 17న విక్రాంపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆయా గ్రామాలకు సంబంధించిన సుమారు రూ.10 లక్షల విలువైన జలజీవన్ మిషన్ పైపులు కాలి బూడిదయ్యాయి. ఈనెల 20న వండవలో బంటు వారి వీధిలో పంట్ల అప్పల నరసమ్మకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతై తిండి గింజలతో పాటు గృహోపకరణాలు, నగదు కాలిబూడిదయ్యాయి. దీంతో బాధితులు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిపోవడంతో వారి వేదన చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. ప్రస్తుతం అన్నదాతలు ఆరుగాలం పండించిన పంట చేతికంది వచ్చే తరుణంలో ఉన్నందున ఆ కష్టార్జితం బుగ్గిపాలు కాకముందే పాలకులు స్పందించి వీరఘట్టానికి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అగ్నిమాపక శకటం సకాలంలో రాకపోవడంతో బూడిదవుతున్న పైపులు (ఫైల్)

ఆ రహదారంటే భయం... భయం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

బొబ్బిలి, తెర్లాం రోడ్డులో ప్రయాణం చేయాలంటే భయం, భయంగా ఉందని చోదకులు వాపోతున్నారు. విశాఖపట్నం నుండి రాయగడ, రాయగడ నుండి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలు గతంలో పారాది మీదుగా వెళ్ళేవి ప్రస్తుతం పారాది వంతెన పాడవడంతో భారీ వాహనాలు బొబ్బిలి మీదుగా తెర్లాం రోడ్డు ఆకులకట్ట మీదుగా బాడంగి, రామభద్రపురం నుండి హైవే చేరుకొని విశాఖ, రాయగడ రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో బొబ్బిలి, తెర్లాం రోడ్డు భారీ వాహనాలు తిరగడంతో పూర్తిగా పాడై పోవడంతో భారీ వాహన చోదకులు, శ్రీకాకుళం, రాజాం, బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులు ప్రతి రోజు భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రహదారిలో ప్రతిరోజు భారీ వాహనాలు గోతుల్లో కూరుకు పోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా 10 టన్నుల సామర్థ్యం గల రోడ్లలో 40, 50 టన్నుల భారీ వాహనాలు వెళ్లడం వల్లనే ఈ రోడ్లు పాడయ్యాయని చెప్పారు.

యుటిఎఫ్ విజయనగరం జిల్లా కార్యవర్గం ఎన్నిక

విజయనగరం: యుటిఎఫ్ విజయనగరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా మీసాల అప్పలనాయుడు, అధ్యక్షులుగా రమేష్‌చంద్ర పట్నాయక్, ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సహాధ్యక్షులుగా వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా సిహెచ్ భాస్కంరావు, కార్యదర్శులుగా కె.ప్రసాదరావు, జివి రమణ, పి.త్రినాథ, పి.వాసు, పి.వాసుదేవరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, ఎం.కేశవరావు, ఎన్.సత్యనారాయణ, బి.రామినాయుడు, ఆర్ఎవి సూర్యారావు, జి.రాజారావు, శ్రీదేవి, వి.రాధా భవాని, సూరి, శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ.శంకరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.విజయగౌరి, డి.రాము, కె శ్రీనివాసరావు, ఎ.సత్య శ్రీనివాస్, కె.అప్పారావు, జి.పద్మావతి, సిహెచ్ వైకుంఠరావు ఎన్నికయ్యారు.

రక్తదానం సామాజిక చైతన్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రక్తదానం సామాజిక చైతన్యమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుభోతు దుర్గాప్రసాద్ 60వ సారి రక్తదానం సందర్భంగా జరజాపుపేటలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఐ పి. నారాయణరావు, గరివిడి ఎంఇఒ పోలుభోతు రామారావు, నగర పంచా యతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ యువత సామాజిక చైతన్యంతో రక్త దానం, సేవా కార్యక్రమాలు చేప ట్టాలన్నారు. సాధన యువజన సంఘం సామా జిక చైతన్యంతో చేస్తున్న సేవలు మరువలే నివని కొనియాడారు. అనంతరం రక్తదాత దురా గ్రప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, పి.స త్యనారాయణ, మద్దిల శ్రీనివాసరావు, అవనాపు మురళి, నల్లి శివ పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గరివిడి: ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా శ్రీరామ అటానమస్ డిగ్రీ కళాశాలలో 14 ఆంధ్ర బెటాలియన్ రక్తదాన శిబిరాన్ని ఆదివారం ప్రారంభించింది. డిఎస్‌పి ఏఎస్ చక్రవర్తి మాట్లా డుతూ ఎన్‌సిసిలో చేరిన విద్యార్థులందరూ కష్టపడితే వారి వ్యక్తిగత జీవితానికి ఎన్‌సిసి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సుమారు 30 మంది ఎన్‌సిసి స్టూడెంట్స్ రక్తాన్ని దానాన్ని పరిశీలి ంచారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాకాడ శ్రీను, సర్పంచ్ ప్రమీల కుమార్, జి రామకృష్ణ, ప్రిన్సిపల్ బి.రవి పాల్గొన్నారు.

మన్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మానాపురం పంచాయతీలో టిడిపి నాయకులు పడాల భూదేవి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి, మహాశక్తి పథకాల గురించి ఇంటింటికి కరపత్రాలతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంపి, సవర చిన్నారావు, సవర మల్లేష్, సవర సిమ్మయ్య, మాజీ ఎంపిటిసి సభ్యులు బిడ్డిక జయలక్ష్మి, సవర బాలరాజు, తాలాడ, సీనియర్ నాయకులు సవర మంగయ్య, సవర బంగారయ్య, సవర గంగయ్య, మాజీసర్పంచ్ కోతాం, సవర బాలరాజు, తదితరులు, పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని నీలకంఠపురం, ఊసకొండ పంచాయతీల్లో గల దండుసూర, జబ్బమానుగూడ, గంగన్నదొరవలస గిరిజన గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మేనిఫేస్టోలో పెట్టిన కార్యక్రమాల గూర్చి ఇంటింటికి వెళ్లి వివరించి ప్రజల భవిష్యత్తుకి భరోసా ఇచ్చే ఏకైక నాయకుడు చంద్రబాబు అని అన్నారు. కావున రానున్న ఎన్నికల్లో కచ్చితంగా తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భవానీ, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, మండల ప్రధాన కార్యదర్శి శంకర్, టిడిపి నాయకులు ప్రదీప్,రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మానాపురంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు భూదేవి

దత్తిని కలిసిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లేష్

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల టిడిపి పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితలైన దత్తి లక్ష్మణరావును కురుపాం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కడ్రక మల్లేష్ ఆదివారం తన స్వగృహమైన వెంకటాపురానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువా కప్పారు. ఈ సందర్భంగా ఇరువురు కురుపాం నియోజకవర్గ జనసేన, టిడిపి పార్టీల స్థితిగతులు, బలాబలాలు, నియోజకవర్గ సమస్యలు రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి జనసేన కలయికతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, రానున్న ఎన్నికల్లో చరిత్ర సృష్టిస్తూ జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాడేల శ్రీరామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు అభినందనలు

గుమ్మలక్ష్మీపురం : టిడిపి సీనియర్ నాయకులు, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా ఎన్నికైన తర్వాత తన స్వగ్రామం వెంకటరాజపురం వచ్చిన దత్తి లక్ష్మణరావుకు కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పరిశీలకులుగా ఎన్నిక కావడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ మేరకు కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి టిడిపి గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎం.లక్ష్మణరావు, బండి రాజు, బిడ్డిక కొండలరావు తదితరులు ఉన్నారు.



లక్ష్మణరావుకు పూలబొకే అందజేస్తున్న నియోజకవర్గ టిడిపి నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నుంచి రాజాం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జడ్డు చిన్న (23) అనే వ్యక్తి ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న క్వారీ లారీ ఢీకొనడంతో తలకు బలమైన గాయంమవ్వడంతో అక్కడికక్కడే చనిపోయాడు. చిన్నా పాలకొండ పట్టణం ఎన్‌కె రాజపురం నివాసి. ద్విచక్ర వాహనం వెనుక కూర్చొన్న మరో వ్యక్తి వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని మృతి చెందిన చిన్న